# పంచముఖి పురాణం

"ఏమర్రా పలకరేం? గబగబా పలకరాదూ!" సత్యంగారు హుందాగా హెచ్చరించారు. ఒకటి-రెండు-మూడు అనేశారు.

ఆయన్ని చూస్తుంటే ఆదిలో ఆంధ్ర జాతి యింత బలంగా వుండేదేమో అనిపిస్తుంది. వంద మందిలో కూడా స్ఫుటంగా కనిపిస్తాడీయన. చాలా జాగ్రత్తగా ఆడతాడు. ఎప్పుడూ పోదు- పైగా బాగా లాభాలు గడిస్తుంటాడు కూడాను.

"ఉ-ఉ-ఊ" అన్నాడు సత్తిరాజు.

"రెండు" నొక్కి మరీ అన్నాడు సుబ్బారావు.

సూర్యం కూడా "ఊఁ" అని శృతిలో కలిపాడు.

కంగారుగా నరికాడు, వెంకట్రామయ్య రెండో ఎత్తు పేకముక్కలు పైకెత్తేడు. సర్దుకుంటున్నాడు. ఎడమపక్క మీసాలు నాలికతో లాగుతూ ఆలోచిస్తున్నాడు.

మిగతా నాల్గుముఖాలు వెంకట్రామయ్య కళ్ళలోకి చూస్తున్నాయి. యేదో శోభిస్తున్నాయి. లెక్కలు వేస్తు న్నాయి.

"ఏంరా ఏమైనా కలిసిందా?" అన్నాడు సత్తిరాజు.

"ఎందుకో ఆలస్యం. రెండో ఎత్తేకాదేంటి— పారేస్తే పారెయ్యి బేస్తుకి" అన్నాడు సూర్యం.

"ఎందుకురా అంతా తలోమాటా!" మందలించాడు సుబ్బారావు. క్రాపు సవరించుకుంటూ.

"వాడి ముఖం తెలియడం లేదుటోయ్... కలిస్తే అలా వుంటుందా!" జోస్యం చెప్పాడు సత్యంగారు.

"కళావరు!" అన్నాడు వెంకట్రామయ్య ఎట్టకేలకు.

"ఎత్తింది మంచిఎత్తే... ఒక్కముక్క లేకపోతే ఏం చేస్తాం" కొంచెం బిగ్గరగానే అనుకున్నాడు తనలో. ఇస్పేటు జాకీ పాడిమీద నరికితే ఒక్కటి రాలేదు. పైగా దించేసిన రంగే వచ్చిపడింది. ఏంచేస్తాడు పాపం? సరే బేస్తుకిపారేశాడు వెంకట్రామయ్య.

సుబ్బారావు పేకనొల్లుతూ అన్నాడు... "ఒక్కొక్క ప్పుడు అంతేనో - ఎద్దవ పేక! ఒక్కటీ కలవదు!!" అని కలుపుతున్నాడు పేక.

పేకాటమాత్రం బలే ఉద్రేకమైనది. పోతున్నవాడు సంపాదించుకోవాలనీ వస్తున్నవాడు ఇంకా కూడబెట్టుకోవాలని ఆడతారు. అసలు బొత్తిగా రానివాళ్ళు "పోనీ సిగరెట్టుఖర్చు కేనా రాదా?" అనుకుంటారు. మొత్తంమీద అంతా సంపాదించుకోవాలనే కూర్చున్నా. ఎవ్వడూ ఆవిషయం బైటపెట్టుకోడు. ప్రతివాడు నిష్కామకర్మ ఆచరిస్తున్నట్లే నటిస్తారు. చిత్రం! ఎవడికేనా గట్టిగా నష్టం వాటిల్లేసరికి వుడుకుమోత్తనంతో ప్రారంభమై కన్నీళ్ళ పర్యంత మౌతాడు!

నయం! ఒకోసారి అంతటితోను ఆగదు. దెబ్బలాటలు, తిట్లు, మాటలుపోవడం వగైరాలు సంఘటిస్తాయి! పేకాటలో బాగా లాభం సంపాదించినవాణ్ణి ఖూనీచేయడంకూడా కొత్త విషయంకాదు.

కిందటిసారి సత్యంగారు వచ్చారు. ఫండుగ మూడు రోజులూ పేకాట వేసారు! ఆదెబ్బతో సత్యంగారికి అయిదు రూపాయిలుదాకా లాభం వచ్చిందట. పిల్లలికి గొన్లు కుట్టించమని ఇంట్లో యిచ్చి వెళ్ళిపోయాడట!

ఎలా కూపీలాగేడో యీవిషయం, సూర్యం బైట

పెట్టాడు. ఈమాటు బాగా దెబ్బ తినిపించాలని ఎత్తులు వేస్తున్నాడు. జాగ్రత్తగా ఆలోచిస్తూ ఆడుతున్నాడు.

ఎదురెదురుగా కూర్చున్న ముఖాల్లోంచి వస్తూన్న పొగంతా మధ్యలో చేరుకుంటోంది. వేరువేరు స్వభావాలు, ఆశలు, అభిరుచులు కలిగిన మనుషులంతా 'పేకాట' అనే సామాన్య విషయంమీద కలుసుకొని ఆడుతున్నారు. అలాగే అన్ని ముఖాల్లోంచి వెలువడుతున్న పొగలు వివిధరకాలవైనా మధ్యలో చేరుకుంటున్నాయి. ఒకే సామాన్యగుణంగల పొగ కావడంవల్ల విడదీయలేనంతగా కలిసిపోయాయి. జన్మస్థానాలు జన్మకారణాలు ఏమైనా మిళితమై పెనేసుకుపోయాయి!

పేకముక్కలు పంచడం అయింది. అంతా ఒకటి రెండు పల్టీ కేశారు కూడా.

సత్తిరాజు ఆలోచిస్తున్నాడు. అంకెలూ మాటలు తోర్లిస్తున్నాడు.

'నీకేవచ్చిందోయ్! సత్తిరాజన్నయా– మూడో ఎత్తు!' అన్నాడు సూర్యం.

బాగా ఆలోచించాడు సత్తిరాజు. "ఆలోచనెందుకు? కలిస్తే ఆట– లేకపోతే బేస్తూనూ" అనుకున్నాడు తనలో. అందరికీ వినిపించింది. 'జెయ్ సద్దురు!' అని దింపిన ముక్కలపై పేక పడేశాడు– తీసుకున్నాడు– సర్దుకుంటున్నాడు.

అదేం ఖర్మమో? బుర్రి ఆలోచనలో పడిపోయిందని కనిపెట్టేశారంతా.

"రమణమహర్షి చాలా గొప్పవాట్ట" సభికుల నుద్దేశించి సుబ్బారావన్నాడు.

"అఁఅమ్మో!" అంటూ సుబ్బాగాపుతో ఏకీభవించారు సత్యంగారు.

పూర్ణ్యం కాస్త నెమ్మదిగా 'రమణమహర్షి!' అని భక్తిగా స్మరించుకున్నాడు. ఇతరులు గ్రహించకుండానే దాన్నే కూనిరాగంగా మార్చాడు.

"ఏవిటోయ్! మాటాడవేం? ఇదీ డిటోయేనేంటి!" చురకవేశాడు వెంకట్రామయ్య ఒళ్లు విరుచుకుంటూ.

"ఉండండోయ్! వాణ్ణి కంగారుపెట్టకండి— ఇంతకీ పిల్ల పేరేంటో చెప్పరా?" సత్యంగారు సద్దుకుని గంభీరంగా కూర్చుని అడిగారు. మహా గట్టి మనిషి. పేకాటలో బాగా చేయితిరిగిన మనిషి!

"ఐదూ చేతులోవే— మూడు ముక్క—లేదు. బేస్తయిపోయింది!" అన్నాడు సత్తిరాజు నిరాశలోవచ్చిన విచారాన్ని కప్పుకోడానికి పెద్దగా నవ్వాడు.

"సరే ఆడు" అంటే ఆడమన్నారంతా.

"ఆఠీను తురుపు; నే చెప్పలేదూ? బేస్తయిపోతుంది" మళ్ళీ అన్నాడు సత్తిరాజు.

"కుదేలు అవుతుందేమోనని!" అన్నాడు సత్యంగారు.

'అబ్బే లేదు. ఇదిగో నాలుగోపట్టు!" తురుపుచూపించి బేస్తు చేసుకున్నాడు సత్తిరాజు.

అయిదుగురి మధ్యా క్షణం కోలాహలం— నవ్వులు— ఆక్షేపణలు, మందలింపులు ఒకటేమిటి? అన్ని లక్షణాలు— సత్తిరాజు ఆటగురించి వర్ణిస్తూ విశదపరుస్తున్నాడు. వెంకట్రామయ్య మాత్రమే ఊకొడుతున్నాడు.

"అయిందేదో అయింది— కలపండర్రా!" అన్నాడు సత్యంగారు. రెండు బేస్తులూ తనవే అన్నట్టుగా చూశాడు.

"నేచెప్పలేదూ! రెండు బేస్తు లవడం, సత్యంగారు కొట్టుకుపోవడమూ రివాజని" అనేశాడు సుబ్బారావు.

"ఆ! మహా బేస్తులు కొట్టేశాను. వెయ్యండిరా!" అన్నాడు సత్యంగారు నవ్వుతూ! "అందరికీ రావాలనుకుంటే ఎలాగొస్తుందిలే— అయినా ఎథవ డబ్బు వస్తుందనే కూర్చుంటాంరా?— ఏదో సరదాగా" అన్నాడు సత్యంగారు నలుగురి వంకా చూస్తూ—

" ఏటో రావడంగాని పోవడంగాని ఎంతటిదో!" అన్నాడు సత్తిరాజు. తక్కంగల సభికులంతా సత్యంగారి తీర్మానాన్ని బలపరిచారు.

ప్రతివారికీ డబ్బు వస్తే పట్టుకుపోదామనే వుంటుంది. అందుకోసమే ఆలోచిస్తో ఉంటారు కూడాను. కాని పైకిమాత్రం

ఒక్కరూ అనరు. అంతా పైకి నిష్కామకర్ములే! స్వార్థ రహితులే!!

సూర్యం ఏవిషయమూ నొక్కి చెప్పలేదు. పేక కలిపి పంచడంలో నిమగ్నమయాడు. పంచేశాడు.

ప్రతివారూ తమ కాటపడిందేమో చూసుకుంటున్నారు. ఆత్రంగా చూసుకుంటున్నారు. "అరెరే చెవుల్లోంచి దూసుకుపోయిందే!" అనుకుంటున్నారు ఆటపడనివాళ్ళు.

సత్యంగారు నిండుకుండ! ఒక్కమాట పైకి అనలేదు పైగా, "ఏంటిరా ఆ గల్లంతూ!" అంటున్నాడు తనకేమీ సంబంధం లేనట్టు. మూడు తనకి రావడంకోసం నిరీక్షిస్తున్నాడు.

మూడు అనేశారంతా. ఛాన్సు సత్యంగారికే వచ్చింది. బాగా ఆలోచించుకున్నాడు. వెనకా ముందూ...భగవంతుణ్ణి స్మరించుకున్నాడు. "జెయ్ హింద్!" అంటూ రపీమని చేతిలోని పేక, ముక్కలమీద వేశాడు సత్యంగారు.

'అయితే ఈ ఆట షిల్లీ చెలో ఏ' అన్నాడు కసిగా సూర్యం. మిగతావారంతా పకపకా నవ్వారు.

రెండుబెస్తులమీద ఆట ఒకడే గెల్చుకుపోవడం కంటే ముబ్బేస్తు పంపకమవడం సర్వజన సమ్మతం గనక అందరూ మనస్సులో సత్యంగారి ఆట పోవాలనే అనుకుంటున్నారు.

సత్యంగారు పేక చూసుకుంటున్నారు. ఆలోచించు కుంటున్నారు. కాళ్ళు ముడుచుకు కూర్చుని తువ్వాలుతో వీవుకి బిగించుకున్నారు.

సత్యంగారేంచేస్తే ఎవరికి? మిగతావాళ్ళు వూరుకుంటారా? నాలుగు విమర్శలు నాలుగు కోణాలనుంచీ విసరడం ప్రారంభించారు.

"ఎలాగైనా ఈ రెండుచేస్తులూ సత్యంగారివేనోయ్!'

"ఆయనమాత్రం అంత చచ్చాట వేస్తాడేమిటి?"

సూర్యం మాత్రం ఏమీ అనలేదు.

సత్యంగారు మీనమేషాలు లెక్కపెడుతున్నాడు.

ఎవరో అనేశారు—"రంగు తేలండీ" అని

"కళావరు!" అన్నారు సత్యంగారు.

'తథాస్తు దేవత లూరుకుంటూరా?' అన్నాడు సూర్యం.

ఆయనమాత్రం ఏంచేస్తాడు? వెయ్యడం మంచి 'ఆటే వేశాడుమరి! తురుఫంతా సగం సూర్యానికి, సగం సత్యం గారికి పట్టేసింది. మారాసు పట్టుకూడా లేదు.

టకటకమంటూ గేలప్‌లో నడుస్తోంది అట. సత్యంగారి చేతులోవున్న నాలుగుపట్లూ ఆయనకే వచ్చేశాయి. ఇంకో క్కపట్టే రావాలి. వస్తే ఆట! లేకపోతే చేస్తాను!!

మిగతా నలుగురులోంచి "ఔర్-మ్యావ్!" అని అరుపులు ప్రారంభమయ్యాయి...ఎగతాళి మ్రోగింది.

సత్యంగారి కళ్లు చింతనిప్పుల్లా ఎర్రబడ్డాయి. కోపం ముక్కులోంచి వెచ్చగా శ్వాశిస్తూ, ఘీకరిస్తోంది !

సూర్యం మిగతా పట్టుచూపించాడు. 'ఓయ్-హోయ్!' అంటూ—అరుస్తున్నది ఎవరో తెలియకుండా, కేకలు వేస్తున్నారు సభికులంతా.

సత్యంగారు నిండుకుండ! ఈ క్షుద్రకుంకల అల్లరి సజ్జులా ఆయన అరవలేదు. అయితేనేం? కాలం, ఖర్మం—కలిసి రానప్పుడెంతటివాడికైనా తప్పుతుందా? ఆటమాత్రం పోయింది. మూడో ఎత్తు బేస్తు అయిపోయింది.

మానధనులైన సత్యంగారు భరించలేక పోయారు. రొంటినున్న నాలుగు రూపాయల పదమూడణాలు అక్కడే పడేశారు.

"మీరు రాడుకోండిరా. నేనింక ఆడను. పనుందీ" అన్నారు. తువ్వాలు దులుపుకుని వెళ్ళిపోయారు సత్యంగారు!

"నే చెప్పలేదూ? వస్తూంటే మహా వుత్సాహంగా ఆడమని చంపుతాడు. పోయిందా వుడుకుమోత్తనంతో యింతే చేస్తాడు!" అన్నాడు వెంకట్రామయ్య.

సుబ్బారావు పకపకా వూపిరిసలపకుండా నవ్వుతున్నాడు.

సూర్యం సంగతి చెప్పాలా? కేరింతాలతో పెణక ఎగిరిపోతోంది. తనవల్లనే ఇదంతా జరిగిందని అతి సంతోషం.

సత్యంగారెంత దూరం వెళ్ళాడో చూశాడు సత్తిరాజు; "అయ్యో అలా అంటారేమిట్రా. ఆయనకి పనుందిట పాపం!" అన్నాడు బిగ్గరగా. మిగతావాళ్ళకేసిచూసి కన్నుగొట్టేడు—పంచడం ప్రారంభించాడు సత్తిరాజు.

ఇంతకీ చెప్పొచ్చేదేమిటంటే—పేకాట మహోద్యమం లాగ సాగిపోతూనే ఉంది! ♦ ♦

[రచన 1946లో. ఆనందవాణి: (వారపత్రిక) 2—1—1948]